సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 26 । సెప్టెంబర్ । 2023



అభివృద్ధిలో నంబర్‌వన్..
దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.
- 8లో ▸



ఫిర్యాదులను పరిష్కరించాలి
ప్రజావాణిలో వచ్చే వినతులను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అధికారులకు సూచించారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.6 /21.8

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. ఓ మోస్తరునుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

కరిగిపోతున్న కలలు!

- వాయిదాలు, రద్దుల పద్దులో పోటీ పరీక్షలు
- జీవో 317, రేషనలైజేషన్‌తో తగ్గిపోయిన టీచర్ పోస్టులు
- వీఆర్‌వోల సర్దుబాటుతో వందలాది ఉద్యోగాలు గల్లంతు
- నిరుద్యోగుల్లో పెరుగుతున్న నైరాశ్యం

సర్కారు కొలువుల మీద ఆశలు పెట్టుకుని ఏళ్ల తరబడిగా పుస్తకాలతో కుస్తీ పడుతున్నవారి కలలు క్రమంగా కరిగిపోతున్నాయి. పోటీ పరీక్షల నోటిఫికేషన్లలో తీవ్ర జాప్యం, నోటిఫికేషన్ విడుదలైనా పరీక్షలు రద్దవడం, వాయిదాల మీద వాయిదాలు పడడం, ఉద్యోగాల రేషనలైజేషన్ తదితర కారణాలతో నిరుద్యోగుల్లో నైరాశ్యం అలుముకుంటోంది. ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలతో ఉద్యోగాలు వచ్చే పరిస్థితి కనిపించడం లేదని, కొలువులేమో కానీ తమకు పోటీ పరీక్షలకు సన్నద్ధమవడం కోసం చేసిన అప్పుల భారం మాత్రం పెరుగుతోందని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి, కామారెడ్డి





టీచర్ పోస్టుల మీద మోజుతో వేలాది మంది నిరుద్యోగులు బీఎడ్, డీఎడ్, బీపెడ్ పూర్తిచేశారు. టెట్ రాసి క్వాలిఫై అయిన వారంతా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. ఏళ్ల తర్వాత డీఎస్సీ వేసినా.. తక్కువ సంఖ్యలో పోస్టులుండడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు. ఇక గ్రూప్–2, గ్రూప్–1 ఉద్యోగాల కోసం కూడా వేలాది మంది ప్రిపేర్ అయ్యారు. అయితే పోస్టుల కోసం నోటిఫికేషన్లు వేయడం, ఏదో కారణంతో పరీక్ష వాయిదా పడడం, పరీక్షలు అయినవి రద్దు కావడం వంటివి నిరుద్యోగుల ఆశలను చిదిమేస్తున్నాయి.

గ్రూప్–1 కొలువుల కోసం ఏళ్లుగా అంకుఠిత దీక్షతో పుస్తకాల్లో పురుగులుగా మారిన నిరుద్యోగులు.. గతేడాది అక్టోబర్ 16న నిర్వహించిన పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష రిజల్ట్ కూడా రావడంతో ఆనందించారు. ఇక కొలువు వచ్చినట్లేనని భావించిన వారి సంతోషం ఎంతోసేపు నిలవలేదు. పేపర్ లీకయ్యిందన్న కారణంతో ప్రభుత్వం పరీక్షను రద్దు చేసింది. జూన్ 11న రెండోసారి

రెండుసార్లు రద్దవడంతో..

నిర్వహించిన పరీక్షను జిల్లాలో 4,549 మంది రాశారు. కీ చూసుకున్నవారిలో చాలామంది క్వాలిఫై అవుతామన్న ఆనందంతో రిజల్ట్ కోసం వేచి చూస్తున్నారు. పరీక్ష నిర్వహణలో లోపాలతో న్యాయస్థానం గ్రూప్–1 ప్రిలిమ్స్‌ను రద్దు చేస్తూ తీర్పివ్వడంతో అభ్యర్థులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. దాదాపు రెండేళ్లుగా రాత్రింబవళ్లు కష్టపడి చదివామని, ఇప్పుడు మళ్లీ పరీక్ష రాయాలంటే ఎలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెవెన్యూ వ్యవస్థ రద్దుతో ఇబ్బందులు

వీఆర్‌వో, వీఆర్‌ఏ వ్యవస్థలు రద్దు చేయడం నిరుద్యోగులకు శాపంగా మారింది. వీఆర్‌వో ఉద్యోగాలు చేసేవారు రిటైర్ అవుతున్న కొద్దీ ఆ ఉద్యోగాలు దొరుకుతాయనే ఆశ ఉండేది. ప్రభుత్వం వీఆర్‌వో, వీఆర్‌ఏ వ్యవస్థలను రద్దు చేసి, వారిని ఇతర శాఖల్లో సర్దు బాటు చేసింది. వారితో ఇతర శాఖల్లోనీ ఖాళీలన్నీ దాదాపు భర్తీ అవడంతో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లేకుండాపోయాయి.

కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలే దిక్కు

ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలు క్రమక్రమంగా తగ్గిపోతుండడంతో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలే దిక్కవుతున్నాయి. వివిధ శాఖల్లో తక్కువ వేతనంపై ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిన నియామకాలు చేపట్టినా వాటికీ పోటీ పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సమగ్ర శిక్షా అభియాన్‌లో ఏళ్ల తరబడిగా ఉద్యోగాలు చేస్తున్న వారంతా రెగ్యులరైజ్ కోసం నెత్తీనోరు బాదుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు.

వైద్య ఆరోగ్య శాఖలోనూ ఎంతోమంది కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్నారు. చాలామంది వయసు మీరుతుండడంతో ఇతర ఉద్యోగాలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది.

ప్రైవేటు ఉద్యోగాలూ అంతంతే....

కరోనా తర్వాత ప్రైవేటు రంగంలో ఉద్యోగాల్లో చాలా కోత పెట్టారు. వివిధ రంగాల్లో పనిచేసిన ఎంతోమంది ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడ్డారు. దీంతో ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కల్పన కూడా భ్రమగానే మిగిలిపోతోంది. ఉన్నత విద్యాభ్యాసం చేసి కూడా ఉద్యోగాలు దొరక్క చాలామంది ఇబ్బందిపడుతున్నారు. పట్టణాల్లో అద్దెల భారం భరించలేక చాలామంది సొంతూళ్లకు వెళ్లి కుల వృత్తులు, ఉపాధి, కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో తెలంగాణ ఉద్యమం సాగించి రాష్ట్రం సాధించుకున్నామని, పాలకులు ఇప్పటికైనా ఉద్యోగ నియామకాల విషయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

సొంత జిల్లాలకు ఉద్యోగులు బదిలీ అయ్యేలా తీసుకువచ్చిన జీవో నం.317తో కామారెడ్డి జిల్లా నష్టపోయింది. ముఖ్యంగా ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించి నిజామాబాద్ జిల్లాకు చెందిన వారు దాదాపు నాలుగు వందల మంది కామారెడ్డికి అదనంగా వచ్చారు. దీంతో ఉపాధ్యాయ ఖాళీల సంఖ్య సగానికి

తగ్గిన టీచర్ పోస్టులు..

తగ్గిపోయింది. ఉపాధ్యాయుల రేషనలైజేషన్, పాఠశాలల మ్యాపింగ్ వంటి ప్రక్రియలతో ఖాళీలు మరింత తగ్గాయి. ఇటీవల విడుదలైన డీఎస్సీలో 200 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చారు. వాస్తవంగా జిల్లాలో 1,250కి పైగా ఖాళీలు ఉండేవి. 317 జీవోతో అదనంగా వచ్చిన వారితో పాటు రేషనలైజేషన్‌తో పోస్టుల సంఖ్య పడిపోయింది. కాగా జిల్లాలో ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకున్న వారు దాదాపు ఇరవై వేల మంది ఉన్నారు. ఇటీవల జరిగిన టెట్ మొదటి పేపర్ 5,535 మంది, రెండో పేపర్ 4,205 మంది రాశారు. కాగా టీచర్ పోస్టులు తగ్గిపోతుండడంతో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు తగ్గిపోతున్నాయి. ఇంతకాలం ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయన్న ఆశతో టెట్, డీఎస్సీల కోసం ప్రిపేర్ అవుతూ వస్తున్నవారు.. తక్కువ పోస్టులతో డీఎస్సీ వేయడంతో తీవ్ర నిరాశకు లోనయ్యారు.

జంబో డీఎస్సీ వస్తుందనుకున్నాం



డీఎస్సీ కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. జంబో డీఎస్సీ వస్తుందని అందరం ఆశలు పెట్టుకున్నాం. పోస్టులు పెరగడం దేవుడెరుగు.. ఉన్నవి తగ్గించేశారు. అన్నీ కలిపి 200 పోస్టులకు నోటిఫికేషన్ వచ్చింది. ఉద్యోగం కోసం చాలా రోజులుగా ప్రిపేర్ అయి కూడా లాభం లేకుండాపోతోంది.

– మంగలి సురేశ్, శెట్పల్లి సంగారెడ్డి, లింగంపేట మండలం

ఎన్నో రోజులుగా ప్రిపేర్ అవుతున్నాం



డీఎస్సీ కోసం ఎన్నో రోజులుగా రూం కిరాయికి తీసుకుని ప్రిపేర్ అయ్యాం. డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందంటే ఎంతో సంతోషపడ్డాం. కానీ పోస్టుల సంఖ్యను చూసి షాక్ అయ్యాం. ప్రభుత్వం పునరాలోచించి పోస్టుల సంఖ్యను పెంచాలి. లేకుంటే నిరుద్యోగులకు అన్యాయం చేసినట్లే.

– ఓంకార్, తునికిపల్లి తండా, నిజాంసాగర్ మండలం

న్యూస్‌రీల్

4న బాన్సువాడకు కేటీఆర్ రాక



బాన్సువాడ: బాన్సువాడ పట్టణంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు నాలుగో తేదీన ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ వస్తారని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన పట్టణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాన్సువాడలో రూ. 3 కోట్లతో నిర్మించిన మున్సిపల్ కార్యాలయం, రూ.2 కోట్లతో నిర్మించిన ఆర్డీవో కార్యాలయం, రూ. 4 కోట్లతో నిర్మించిన మల్టీ జనరేషన్ పార్కు, పిల్లల పార్కు, రూ. 30 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న ట్రాఫిక్ సిగ్నల్, వీక్లీ మార్కెట్‌లో నిర్మించిన సీసీ రోడ్లను మంత్రి ప్రారంభిస్తారన్నారు. వీక్లీ మార్కెట్‌లో నిర్వహించే బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొంటారన్నారు. కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ఏఎంసీ చైర్మన్ నర్సింలు, డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, ఆర్డీవో భుజంగరావు, కమిషనర్ రమేష్, నాయకులు అంజిరెడ్డి, ఎజాస్, వెంకట్‌రాంరెడ్డి, పాత బాలకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు బాడి శ్రీనివాస్, లింగం, కనుకుట్ల రాజు, కిరణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగాలో జిల్లాకు పతకాల పంట



కామారెడ్డి అర్బన్: రాష్ట్రస్థాయి యోగా స్పోర్ట్స్ చాంపియన్ షిప్‌లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. జిల్లా క్రీడాకారులు 8 పతకాలు సాధించారని జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం రాంరెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా కడ్తల్‌లోని పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఈనెల 22 నుంచి 24 వరకు రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయన్నారు. సింధూజ, సహస్ర, కవిత, సునీత, జ్యోత్స్న, స్రవంతి, సరస్వతి, మౌనిక, ఐశ్వర్య వ్యక్తిగత, సామూహిక విభాగాలలో పతకాలు సాధించారన్నారు. సోమవారం వారిని అసోసియేషన్ ప్రతినిధులు అనిల్ రెడ్డి, బి.రఘుకుమార్, లింగమూర్తి, గోమతి అభినందించారు.

30న జాబ్‌మేళా

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఈనెల 30న జాబ్‌మేళా నిర్వహించనున్నారు. హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ సంస్థ డీ అండ్ డీ టెక్ సొల్యూషన్స్‌లో ఉద్యోగాల కల్పన కోసం టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కే.కిష్టయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2019 నుంచి 2023 వరకు బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీటెక్ కోర్సులు చదివినవారు అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాలకోసం 94403 56276, 91823 04067 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'వచ్చే నెలాఖరువరకు ఈ-కేవైసీకి అవకాశం'

కామారెడ్డి రూరల్: రేషన్ కార్డులకు సంబంధించి ఈ–కేవైసీకి వచ్చేనెలాఖరు వరకు అవకాశం ఉందని రేషన్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీపతి యాదవ్, మాజీ అధ్యక్షుడు గౌరిశెట్టి రాజు ఓ ప్రకటనలో తెలిపారు. హాస్టళ్లలో ఉండి చదువుకుంటున్నవారు సెలవులలో ఇళ్లకు వచ్చినప్పుడు ఈ–కేవైసీ చేయించాలని సూచించారు. అందుబాటులో ఉన్నవారు మాత్రం త్వరగా కేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కోరారు.

'ఆర్టీసీలో 24 గంటల విచారణ సేవా కేంద్రం ఏర్పాటు'



కామారెడ్డి టౌన్: ఆర్టీసీ ప్రయాణికుల కోసం 24 గంటల పాటు సమాచారం అందించడానికి విచారణ వినియోగదారుల సేవా కేంద్రం ఏర్పాటు చేశామని కామారెడ్డి డిపో మేనేజర్ ఇందిర తెలిపారు. కామారెడ్డి బస్సులకు సంబంధించి 08468 220281 నంబర్‌లో, కార్గోకు సంబంధించి 94928 02266, 08468 353448 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'సీఎం కేసీఆర్‌తోనే గుర్తింపు'

నిజాంసాగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ వల్లే నిజాంసాగర్ మండలానికి ప్రత్యేక గుర్తింపు దక్కిందని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. సోమవారం మల్లూర్, గోర్గల్, బంజపల్లి, అచ్చంపేట గ్రామాల్లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ నిజాంసాగర్ మండలానికి చెందిన దఫేదార్ రాజు కుటుంబానికి రెండుసార్లు జెడ్పీ చైర్మన్ పదవి ఇచ్చారన్నారు. సీఎం కేసీఆర్ కామారెడ్డి జిల్లా నుంచి పోటీ చేస్తుండడంతో జుక్కల్ మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మల్లూర్‌లో ఆరోగ్య ఉప కేంద్రం భవనం ప్రారంభం సందర్భంగా స్థానికులు అభివృద్ధి పనులపై ఎమ్మెల్యేను నిలదీసే ప్రయత్నం చేయగా బీఆర్‌ఎస్ నాయకులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు దుర్గారెడ్డి, గంగారెడ్డి, సత్యనారాయణ, గైని విఠల్, వాజిద్ అలీ, నర్సింహారెడ్డి, ఒంటరి కళ్యాణి, విఠల్‌రెడ్డి, కాశీంసాబ్, అనుసూయ, సుజాత, మనోహర్, రమేష్‌గౌడ్, యాటకారి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



నిజాంసాగర్‌లో సెంట్రల్ లైటింగ్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హన్మంత్ సింధే

రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కామారెడ్డి టౌన్: గ్రూప్–1 ప్రిలిమ్స్ రద్దు చేయడాన్ని నిరసిస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పరిషత్ జిల్లా కన్వీనర్ కృష్ణ మాట్లాడుతూ గ్రూప్–1 పరీక్ష రెండోసారి రద్దవడం దురదృష్టకరమన్నారు. నిరుద్యోగుల జీవితాలతో సీఎం కేసీఆర్ ఆడుకుంటున్నారని ఆరోపించారు. వెంటనే టీఎస్‌పీఎస్సీను ప్రక్షాళన చేయాలన్నారు. పరీక్షల రద్దు, పేపర్ లీకేజీలకు బాధ్యత వహిస్తూ సీఎం కేసీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు ఖలీల్, రాకేష్, మోహన్, వెంకటేశ్, సిద్దు, భాను తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ కార్యకర్తలు

ముదిరాజ్‌లను విస్మరిస్తే ఓడిస్తాం

- అసెంబ్లీ టికెట్లు ఇవ్వని పార్టీలపై ధర్మయుద్ధం చేస్తాం
- ఒక్క టికెట్టూ కేటాయించని బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెబుతాం
- ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకుడు నిజ్జన రమేశ్
- జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ, సభ

కామారెడ్డి టౌన్: అసెంబ్లీ ఎన్నికలలో ముదిరాజ్‌లకు టికెట్లు ఇవ్వకుండా విస్మరించే పార్టీలకు ఓట్లతో గుణపాఠం చెబుతామని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకుడు నిజ్జన రమేశ్ హెచ్చరించారు. ముదిరాజ్‌లకు ఒక్క టికెట్టూ ఇవ్వని బీఆర్‌ఎస్‌ను గద్దెనెక్కనివ్వబోమని పేర్కొన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ముదిరాజ్‌లకు సముచిత సంఖ్యలో టికెట్లు ఇవ్వాలన్న డిమాండ్‌తో సోమవారం ధర్మయుద్ధం పేరుతో జిల్లాకేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. సీఎస్ఐ గ్రౌండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ కొత్తబస్టాండ్, నిజాంసాగర్ చౌరస్తా, స్టేషన్‌రోడ్, సిరిసిల్ల రోడ్ మీదుగా సాగి కామారెడ్డి డిగ్రీ కళాశాల మైదానానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఇందిరాచౌక్, నిజాంసాగర్ చౌరస్తాలలో ధర్నా చేశారు. కానిస్టేబుల్ కిష్టయ్య, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించిన సభలో నిజ్జన రమేశ్ మాట్లాడుతూ ముదిరాజ్‌కు ఒక్క టికెట్ ఇవ్వని బీఆర్‌ఎస్ తీరును ఎండగడుతూ సీఎంకు వ్యతిరేకంగా కామారెడ్డిలో భారీ సంఖ్యలో నామినేషన్లు వేస్తామన్నారు. ముదిరాజ్‌లను వెంటనే బీసీ ఏ లోకి మార్చాలన్నారు. రూ.10వేల కోట్లతో ముదిరాజ్ ఆర్థిక సహకార సంస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కామారెడ్డిలో ముదిరాజ్‌లకు 50 వేలు, ఎల్లారెడ్డిలో 70 వేలు, గజ్వేల్‌లో 50 వేల ఓట్లు ఉన్నాయని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు బట్టు విఠల్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో ముదిరాజ్‌లకు భారీ సంఖ్యలో ఓట్లున్నాయని, బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఓడించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అబ్బబోయిన స్వామి, చింతల నీలకంఠం, కరాటే రమేష్, భూపాల్ విజయానంద్, సూర్యప్రసాద్, నీల నాగరాజు, భాను ప్రకాష్, పిల్లి మల్లేష్, కాకర్ల శేఖర్, గోలివాడ శంకర్, కుడుముల సత్యం, బైండ్ల పోచయ్య, రాజ్ దాస్, గణేష్, తూర్పు రాజు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముదిరాజ్‌లు



నిజాంసాగర్ చౌరస్తాలో ధర్నా చేస్తూ..



సభలో మాట్లాడుతున్న నిజ్జన రమేశ్

ఎన్నికల ఏర్పాట్లను ముమ్మరం చేయాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్

కామారెడ్డి క్రైం: ఎన్నికల ఏర్పాట్లను ముమ్మరం చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ కలెక్టర్లకు సూచించారు. సోమవారం సాయంత్రం ఆయన హైదరాబాద్‌నుంచి కలెక్టర్లు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన, పరిష్కారాలను ఈనెల 27వ తేదీలోగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఓటరు దరఖాస్తులను బుధవారంలోపు పరిష్కరిస్తామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వివరించారు.



ఎన్నికల ప్రధాన అధికారితో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ పాటిల్, జిల్లా అధికారులు

నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలి

ఓటరు జాబితా సవరణలో భాగంగా వచ్చిన దరఖాస్తులను నిర్దేశిత సమయంలోగా ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్‌తో వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆయన జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాల పరిశీలనపై ఈఆర్‌వోలు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఓటరు ఎపిక్ కార్డులను ముద్రించి పంపిణీ చేయాలన్నారు. వందశాతం పోలింగ్ కేంద్రాలను సందర్శించి ర్యాంప్, వీల్ చైర్, తాగునీటి సౌకర్యం, టాయిలెట్స్, ఫర్నిచర్, విద్యుత్ సౌకర్యాలను పరిశీలించాలని సూచించారు.

సున్నిత, అతి సున్నిత పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి, వెబ్ కాస్టింగ్ చేపట్టాలని కలెక్టర్ పాటిల్ సూచించారు. తక్కువ ఓటు శాతం నమోదవుతున్న కేంద్రాలపై దృష్టి పెట్టాలన్నారు. కాల్ సెంటర్‌లో వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలన్నారు. సరిహద్దు ప్రాంతాలలో మద్యం, గంజాయి, డబ్బు అక్రమ రవాణా కాకుండా పోలీసు, ఆబ్కారీ, అటవీ శాఖలు నిఘా పెట్టాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మను చౌదరి, చంద్రమోహన్, అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, ఆర్డీవోలు శ్రీనివాస్ రెడ్డి, భుజంగం, స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్ రెడ్డి, డీటీవో వాణి, డీఈవో రాజు, డీపీవో శ్రీనివాస్, కార్మిక శాఖ సహాయ కమిషనర్ సురేందర్, పరిశ్రమల శాఖ ఏడీ రఘునందన్, ఎన్నిక విభాగం పర్యవేక్షకుడు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'గజ్వేల్‌లో అభివృద్ధి శూన్యం'

కామారెడ్డి టౌన్: సీఎం కేసీఆర్ నియోజకవర్గమైన గజ్వేల్‌లో అభివృద్ధి శూన్యమని మాజీ మంత్రి షబ్బీర్‌అలీ విమర్శించారు. సోమవారం కాంగ్రెస్ నాయకులు గజ్వేల్‌కు వెళ్లారు. అక్కడి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ గజ్వేల్‌లో కేసీఆర్ అభివృద్ధి చేయలేదని నిరూపించడానికి వెళ్లామన్నారు. బీఆర్‌ఎస్ దళారులు రైతుల భూములు ఎలా గుంజుకున్నారో అక్కడి ప్రజలు వివరించారన్నారు. రింగ్ రోడ్డు వేసి కేసీఆర్ కుటుంబం పేదల భూములు దోచుకుందన్నారు. గజ్వేల్ బస్టాండ్ పనులను 9 ఏళ్లుగా సాగదీస్తూనే ఉన్నారన్నారు. వర్గల్, అవుసులోనిపల్లి, చౌదర్‌పల్లి, మల్లారెడ్డిపల్లి గ్రామాల్లో ఇందిరా గాంధీ హయాంలో పంచిన 1,200 ఎకరాల భూములను ప్రస్తుత పాలకులు పేదలనుంచి లాక్కున్నారని ఆరోపించారు. తమ భూములు కావాలని 95 రోజుల నుంచి రైతులు ధర్నా చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సీఎం కేసీఆర్ గజ్వేల్‌కు పట్టిన శని అని అక్కడి ప్రజలు భావిస్తున్నారన్నారు. కామారెడ్డి ప్రజలకు ఆ శని పట్టనివ్వబోమన్నారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, నాయకులు కాసుల బాలరాజు, ఇంద్రకరణ్‌రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, భీంరెడ్డి, ఐరేని సందీప్, గణేష్ నాయక్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.



గజ్వేల్‌లో అభివృద్ధిని పరిశీలిస్తున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ, కాంగ్రెస్ నేతలు

క్లుప్తంగా

కొనసాగుతున్న కాంట్రాక్టు అధ్యాపకుల దీక్ష



భిక్కనూరు: ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్టు అధ్యాపకులు చేపట్టిన నిరసన దీక్ష సోమవారం 21వ రోజుకు చేరుకుంది. కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నారాయణగుప్తా మాట్లాడుతూ.. అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా పట్టించుకోకవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు డాక్టర్ యాలాద్రి, నర్సయ్య, వైశాలి, శ్రీమాతా, నిరంజన్ శ్రీకాంత్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి వాసితో ఫోన్లో మాట్లాడిన సీఎం


విఠల్‌రెడ్డి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండలంలోని ఎండ్రియాల్‌కు చెందిన బీఆర్‌ఎస్ ఉద్యమకారుడు, జిల్లా కళాకారుడు విఠల్‌రెడ్డితో సీఎం కేసీఆర్ మాట్లాడారని గ్రామస్తులు సోమవారం తెలిపారు. ఎమ్మెల్యే సురేందర్ ద్వారా సీఎం కేసీఆర్ కాల్‌చేసినట్లు తెలిసింది. ఉద్యమ జ్ఞాపకాలను గుర్తుచేసుకోవడం, విఠల్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవడం, కామారెడ్డి జిల్లాలో పార్టీ, ప్రభుత్వ పనితీరు గురించి తెలుసుకోవడం, పలు విషయాలపై మాట్లాడారని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా విఠల్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తనతో మాట్లాడడం తనకెంతో ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి తిరుగులేదని సీఎం కేసీఆర్‌కు చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి



కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చే వినతులను వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అధికారులకు సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 72 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, వారికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో సాయన్న, కలెక్టరేట్ పాలనాధికారి మసూర్ అహ్మద్, అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా

మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బాలరాజు మాట్లాడుతూ.. కార్మికులు వారం రోజులుగా సమ్మె నిర్వహిస్తున్నా ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తుందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వంట కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఈవో రాజుకు వినతి పత్రం అందజేశారు.

సెల్ఫీ విత్ గణేశ్..



పర్యావరణాన్ని కాపాడే రీతిలో ప్రత్యేక ఆకృతుల్లో అపార్ట్‌మెంట్ కమ్యూనిటీ, యువ జన సంఘాల మండ పాలు, ఇళ్లలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాల కు సంబంధించి 'సాక్షి' సెల్ఫీలు ఆహ్వానిస్తోంది. ఆసక్తిగలవారు వినాయక ప్రతిమలతో సెల్ఫీలు దిగి కింది నంబరుకు వాట్సాప్ చేయగలరు.

పంపించాల్సిన వాట్సాప్ నం..
96039 39111


యువన్, వీరు, మహా(కామారెడ్డి)


దయాల్, పిట్లం


సాయి, బాలకిషన్, శ్రీను, గోపి (కామారెడ్డి)


శివాజీరావు బూర్గుల్ సర్పంచ్, రమేశ్‌రావు


మాసుల శీలా రమేశ్, శ్రావణి రవి (కామారెడ్డి)


స్నేహా శెట్టి, రాజంపేట


గిర్మితండా గణేశ్ యూత్, గాంధారి


పవన్ యూత్, గాంధారి


భగత్‌సింగ్, శ్రీనివాస్, రాములు పెద్దకొడప్‌గల్


లక్ష్మీకాంతం, అంజమ్మ (సదాశివనగర్)


శ్రీను, శ్రీకాంత్, చింటు, మధు (కామారెడ్డి)


రశ్వీత, ధరణేశ్వర్ (ఎల్లారెడ్డి)


బాల గణేశ్ యూత్, పెద్ద కొడప్‌గల్


మల్లేశ్, అక్షరమాల, శ్రీనిధి (దేవునిపల్లి)


సంజీవ్, టేక్రియాల్


స్వప్న రమేశ్, కామారెడ్డి


ఎం.సృజన్, సుమనశ్రీ, (రాజంపేట)


రవి, వైశాలి, వర్షిత (తాండూర్)


స్వప్న, రాము (అన్నాసాగర్)


మురళీయాదవ్, కామారెడ్డి


ఓంకార్, మద్నూర్


కుర్మ గణేశ్, రాంపూర్, బాన్సువాడ


శ్రీనివాస్, భారతి, సాయిమాధవ్


సహస్ర, హేమక (కామారెడ్డి)


వేణు, భిక్కనూర్

అభివృద్ధిలో నంబర్ వన్ తెలంగాణ

స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న స్పీకర్ పోచారం

బాన్సువాడ రూరల్: దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కాని సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు తెలంగాణలో అమలవుతున్నాయని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డితో కలిసి బోర్లంక్యాంపు తండాలో రూ.20లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన జీపీ భవనాన్ని సోమవారం ప్రారంభించి మాట్లాడారు. గత 10 సంవత్సరాలుగా సీఎం కేసీఆర్ సారథ్యంలో జరిగిన అభివృద్ధిని 75ఏళ్ళ కాలంలో జరిగిన అభివృద్ధితో బేరిజు వేసుకోవాలన్నారు. స్పీకర్‌గా తాను నియోజకవర్గాన్ని రూ.కోట్లాది నిధులతో అభివృద్ధి చేశానని మీ అందరి ఆశీర్వాదంతో భవిష్యత్తులోనూ చేస్తానని భరోసా ఇచ్చారు. కరోనా మూలంగా రాష్ట్ర ఖజానాకు రావాల్సిన ఆదాయం రాకపోవడంతో రుణమాఫీ చేయడంలో ఆలస్యం జరిగిందని స్పీకర్ అన్నారు. రుణమాఫీకి రూ.20వేల కోట్లు అవసరమని ప్రభుత్వం గుర్తించిందని, దాంట్లో ఇప్పటికే రూ.13వేల కోట్లు విడుదల అయ్యాయన్నారు. మిగిలిన వారికి కూడా త్వరలోనే రుణమాఫీ జరుగుతుందని భరోసా ఇచ్చారు. కేవలం 600 ఓట్లు ఉన్న తమ గ్రామంలో రూ.7కోట్ల ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేసిన స్పీకర్‌కు అండగా ఉంటామని సర్పంచ్ నాన్కుపీర్యానాయక్ పేర్కొన్నారు. అర్హులైన పేదలకు ఇంటి స్థలాల పట్టాలు, డబుల్‌బెడ్‌రూం మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాన్కుపీర్యానాయక్, ఎంపీటీసీలు యశోద, శ్రావణి, ఎంపీపీ నీరజ, జెడ్పీటీసీ పద్మ, నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, మోహన్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి, రాజేశ్వర్‌గౌడ్, దేవేందర్‌రెడ్డి, మమ్మాయి కాశీరాం, మన్నెచిన్న సాయిలు, పీర్యానాయక్, కొండ సాయిలు, శ్రీశైలం, శ్రీనివాస్‌రెడ్డి, బోడ చందర్, రతన్, సుభాష్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన జట్టు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల క్రీడాకారులు ఉమ్మడి జిల్లా తరఫున రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ అండర్–17 పోటీలకు ఎంపికైనట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ సతీశ్ సోమవారం తెలిపారు. బాలుర, బాలికల విభాగంలో అత్యుత్తమ ప్రతిభకనబర్చిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశామన్నారు. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నాయబ్ రసూల్, పీడీలు అతీకుల్లా, లింగం, నగేశ్ తదితరులున్నారు.

బాన్సువాడ నుంచి ఇద్దరు..

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం క్యాంపులో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలిక గురుకుల విద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థి నులు ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ పద్మకుమారి తెలిపారు. బి.నందిని, వై.సాత్వికలు రాష్ట్రజట్టుకు ఎంపికయ్యారన్నారు. క్రీడాకారిణులను ప్రిన్సిపాల్ పద్మకుమారితోపాటు పీఈటీలు సుప్రీత, ప్రభావతి, అధ్యాపకులు అభినందించారు.

బీసీలకు రెండు సీట్లు కేటాయించాలి



ఆర్మూర్/ఖలీల్‌వాడి: నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో రెండు అసెంబ్లీ టికెట్లను బీసీల కు కేటాయించాలని టీపీసీసీ ఇన్‌చార్జిని ఆర్మూర్‌నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు గోర్త రాజేందర్ కోరారు. ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో ఠాక్రేను రాజేందర్ సోమవారం కలిశారు. ఆర్మూర్ పరిధిలో బీసీల శాతం వివరాలను ఠాక్రే దృష్టికి తీసుకెళ్లిన రాజేందర్ తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఠాక్రే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు రాజేందర్ తెలిపారు.

సైక్లింగ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కాంత్‌రావు



నిజామాబాద్‌నాగారం: సైక్లింగ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా భూలోకం విజయ్‌కాంత్ రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యా రు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో సోమవారం నూతన కా ర్యవర్గాన్ని ఎన్నుకున్నారు. విజయ్‌కాంత్‌రావు ఎన్నికపై ఒలింపిక్ సంఘం అధ్యక్షు డు ఈగ సంజీవరెడ్డి, కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, సైక్లింగ్ సంఘం అధ్యక్షుడు జీవీ కృపాకర్‌రెడ్డి,ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్ సుబేదార్, సూర్యప్రకాశ్, కోశాధికారి సురేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాకేశ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి దివాకర్, నరేశ్‌కుమార్, శరత్‌గౌడ్, దుర్గా మల్లేశ్, వినోద్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థి అదృశ్యం


బాలాజీ

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఉంటూ ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థి గాయిచోడి బాలాజీ అదృశ్యమైనట్లు పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఈనెల 23వ తేదీన తోటి విద్యార్థులతో కలిసి హాస్టల్ నుంచి స్కూల్‌కు వెళ్లిన బాలాజీ, క్లాస్ టీచర్ ఫోన్ తన తల్లికి ఫోన్ చేయగా ఆమె లిఫ్ట్ చేయలేదన్నారు. స్కూల్‌ముగిసిన అనంతరం విద్యార్థులందరూ హాస్టల్‌కు వచ్చినప్పటికీ బాలాజీ రాలేదు. ఆచూకీ లభించకపోవడంతో హాస్టల్ ఇన్‌చార్జి నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. అదృశ్యమైన విద్యార్థి బాలాజీది కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం కొడిచెర్ల అని సీఐ తెలిపారు.

డాంబర్ ట్యాంకర్‌లో మృతదేహం

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండలం జానకంపేట్ సమీపంలోని ఓ వెంచర్‌లో నిలిపిఉన్న డాంబర్ ట్యాంకర్‌లో వ్యక్తి మృతదేహం కనిపించడం కలకలం సృష్టించింది. ట్యాంకర్‌ను మూడు నెలల క్రితం వెంచర్‌లో డ్రైవర్‌నిలిపివెళ్లాడు. ఆదివారం రాత్రి ట్యాంకర్‌ను తీసుకెళ్లేందుకు రాగా, ట్యాంకర్ మూత తీసి ఉండడంతో డ్రైవర్ అందులోకి తొంగి చూశాడు. వ్యక్తి మృతదేహం కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహం భాగాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా? లేక హత్యనా? అని స్థానికులు చర్చించుకుంటున్నారు.

సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుందాం

ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్


మాచారెడ్డిలో పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్

మాచారెడ్డి: కామారెడ్డి నియోజక వర్గం నుంచి పోటీ చేస్తున్న సీఎం చంద్రశేఖర్ రావును భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. మండల కేంద్రంలో నాలుగు వరుసల రోడ్డు నిర్మాణానికి సంబంధించిన పైలాన్‌ను సోమవారం ఆవిష్కరించారు. అనంతరం గజ్యా నాయక్ తండా, ఘన్‌పూర్, కాకుల గుట్ట తండా, లచ్చాపేట గ్రామాల్లో పర్యటించారు. సీఎం కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేయడం నియోజకవర్గ ప్రజల అదృష్టమని అన్నారు. ఇప్పటికే అభివృద్ధిలో దూసుకుపోతున్న కామారెడ్డి ఇంకా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మండలంలోని మాచారెడ్డి, గజ్యా నాయక్ తండా, ఘన్ పూర్, కాకుల గుట్ట తండా, లచ్చాపేట గ్రామాల్లో రూ. 20కోట్ల30లక్షలతో పలు అభివద్ధి పనులకు శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక..

ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం మండల అధ్యక్షుడు సుధాకర్‌తో పాటు పది మంది ఘన్‌పూర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు, జెడ్పీటీసీ మినుకూరి రాంరెడ్డి, వైస్ ఎంపీపీ నర్సింహారెడ్డి, సర్పంచులు హంజీ నాయక్ లలిత, లత, హేమ్లు, జగతి, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

యువతిపై దాడి ఘటనలో సీన్ రీకన్‌స్ట్రక్షన్

- నిందితుడిపై కిడ్నాప్, హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు
- బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న సీపీ, రూరల్ ఎమ్మెల్యే
- జక్రాన్‌పల్లిలో దళితుల ఆందోళన


సీన్ రీకన్‌స్ట్రక్షన్ నిర్వహిస్తున్న సీపీ సత్యనారాయణ

జక్రాన్‌పల్లి/ఖలీల్‌వాడి : జక్రాన్‌పల్లిలో దళిత యువతిపై దాడిచేసిన యువకుడు తౌసుపుద్దీన్‌పై పోలీసులు కిడ్నాప్, హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. జిల్లా కేంద్ర ప్రభుత్వఆస్పత్రికి రూరల్‌ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, సీపీ సత్యనారాయణ వెళ్లి వెంటిలేటర్‌పై ఉన్న బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని, రెండు టీంలు దర్యాప్తు చేస్తున్నాయని సీపీ తెలిపారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా నిందితుడికి త్వరగా శిక్షపడే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. బాధితురాలి కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడారు. ఈ ఘటనలో ఎవరినీ ఉపేక్షించేది లేదని, నిందితుడికి శిక్షపడేలా చూస్తామన్నారు. బాధితురాలికి మెరుగైన వైద్య అందించాలని సూపరింటెండెంట్ ప్రతిమారాజ్‌ను కోరారు.

జక్రాన్‌పల్లికి సీపీ..

జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో ఘటనా స్థలాన్ని సీపీ సత్యనారాయణ పరిశీలించారు. పోలీసు సిబ్బందితో కలిసి సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేశారు. నిందితుడు యువతిని మోటార్‌సైకిల్‌పై ఎక్కించుకున్నప్పుడు పడిపోయిందని చెప్పడం అనుమానాస్పదంగా ఉందన్నారు. ఏసీపీ కిరణ్‌కుమార్, డిచ్‌పల్లి సీఐ కృష్ణ బృందం ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోందని సీపీ తెలిపారు.

రెండు గంటల పాటు ఆందోళన..

దళిత యువతిపై దాడికి పాల్పడిన యువకుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ దళిత సంఘాల ఆధ్వర్యంలో జక్రాన్‌పల్లిలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. రెండు గంటల ధర్నా కొనసాగింది. అంబేడ్కర్ చౌరస్తా నుంచి జాతీయ రహదారి వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం బస్టాండ్ ప్రాంతంలో ధర్నా చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ధర్నా చేస్తున్నవారి వద్దకు చేరుకొని మాట్లాడారు. నిందితుడికి శిక్షపడేలా చూస్తామని, బాధితురాలికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. నిందితుడిని ఉరితీయాలని ఈసందర్భంగా దళితులు డిమాండ్ చేశారు.

రూ.50 లక్షల గంజాయి పట్టివేత

- 157 కిలోలకుపైగా ఎండు గంజాయి స్వాధీనం
- ఇద్దరి అరెస్ట్, రెండు వాహనాలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ కిషన్

ఖలీల్‌వాడి: రూ.50 లక్షల విలువ చేసే ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కిషన్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆయన వివరాలను వెల్లడించారు. నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ తదితర ప్రాంతాలకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు రెండు రోజులు మాటు వేసి పట్టుకున్నట్లు తెలిపారు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌కు చెందిన బానోత్ వసంత్‌రావు(46), బానోత్ ప్రవీణ్(27)ను అరెస్ట్ చేసి వారి నుంచి మహీంద్ర వాహనంతోపాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బానోత్ వసంత్‌రావు 30 ఏండ్లుగా గంజాయి దందా చేస్తున్నట్లు తెలిపారు. నిందితులు గంజాయిని ఒరిస్సా నుంచి మహారాష్ట్రకు తీసుకువచ్చి మహారాష్ట్రలోని బోకర్ తాలుకా కేంద్రంలో గంజాయిని నిలువ చేస్తారని, వాటిని ఏజెంట్లకు రెండు నుంచి మూడు కిలోల ప్యాక్ చేసి అందిస్తారని చెప్పారు. సోమవారం 157 కిలోలకుపైగా గంజాయిని మహారాష్ట్ర నుంచి తీసుకువస్తుండగా, నిజామాబాద్‌లో పట్టుకున్నామన్నారు. నిందిలను పట్టుకునేందుకు సహకరించిన సీపీ సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. సమావేశంలో సీఐలు స్వప్న, వెంకటేశ్, ఎస్సై రామ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ చిట్టి నారాయణ, హమీద్, ఉత్తమ్, అవినాష్, శివకుమార్, రాజన్న, ఉషన్న, శ్రీనివాస్, ప్రసాద్, విష్ణు, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బాన్సువాడ : బీర్కూర్ శివారులోని ప్రకాశ్‌రావు క్యాంప్ వద్ద సోమవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరికి తీవ్రగాయాలు కాగా, మరొకరికి సల్పగాయాలయ్యాయి. వెంకటప్పయ్య క్యాంపునకు చెందిన నిఖిల్ ప్రకాశ్‌రావు క్యాంపువైపు వెళ్తుండగా, బీర్కూర్‌కు చెందిన శ్రీకాంత్ మల్లాపూర్‌కు వెళ్లి తిరిగివస్తుండగా అదుపు తప్పి రెండు బైక్‌లు ఢీకొన్నాయి. తీవ్రగాయాలపాలైన నిఖిల్‌ను ఆస్పత్రికి తరలించారు.

క్రైం కార్నర్

పెళ్లయిన నాలుగు నెలలకే విడాకులు అడిగిన భర్త

మనస్తాపంతో భార్య ఆత్మహత్యాయత్నం

ఖలీల్‌వాడి: ప్రేమ వివాహం చేసుకున్న నాలుగు నెలలకే భర్త విడాకులు అడగడంతో భార్య మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి.. నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నీలకంఠ నగర్‌కు చెందిన మధుమిత అదే ప్రాంతానికి చెందిన సాయిశశాంక్ ప్రేమించుకున్నారు. పెద్దలు వారి పెళ్లికి నిరాకరించడంతో మే 17న ఆర్యసమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. నాలుగు నెలలకే నువ్వు నాకొద్దు విడాకులు కావాలని భర్త వేధింపులకు గురి చేశాడు.

విడాకులు ఇవ్వకుంటే తనకు ఉన్న సంబంధాలతో ఏం చేయాలో చేస్తానని హెచ్చరించడంతో ఆమె మనస్తాపం చెంది పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ఈ విషయమై బాధితురాలు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ప్రమాదవశాత్తు ఒకరి మృతి

కామారెడ్డి క్రైం: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతి చెందిన ఘటన కామారెడ్డి మండలం తిమ్మక్‌పల్లిలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వంజరి చిన్న భూమయ్య (40) ఈనెల 24న గణేశ్ మండపం వద్దకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బయటకి వెళ్ళాడు. తిరిగి రాకపోవడంతో భార్య లక్ష్మి అతడి ఆచూకీ కోసం రెండురోజులు వెతికింది. సోమవారం చెరువు వద్ద అతడి వస్తువులు కనిపించాయి. గ్రామస్తులు చెరువులోకి దిగి గాలించగా, అతడి మృతదేహం లభించింది. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

వృద్ధురాలి ప్రాణాలు కాపాడిన పోలీసులు



భైంసా: నిర్మల్ జిల్లా బాసర గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధురాలిని స్థానిక పోలీసులు సోమవారం కాపాడారు. నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన దేవుబాయికి కళ్లు సరిగా కనిపించవు. తన ఆరోగ్య సమస్య కుటుంబీకులకు ఇబ్బందిగా మారకూడదని గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు యత్నించింది. అక్కడే ఉన్న కానిస్టేబుల్ వినాయక్, స్థానికుడు లింగన్నయాదవ్ అప్రమత్తమై వృద్ధురాలి ప్రాణాలను కాపాడి ఆమె కుటుంబీకులకు సమాచారం అందించారు. కానిస్టేబుల్‌తోపాటు స్థానికుడిని పలువురు అభినందించారు.

ANAGHA
WANTED
•Supervisors
•Computer Operators (M/F)
•Security Gaurds
•Tailors (M/F) కావలెను.
ఆసక్తి గలవారు నేరుగా సంప్రదించండి
అనఘా షాపింగ్ మాల్

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ University Online Exams:B.A, B.Com, MA(English, Economics, Political Science) M.Com., MA (Journalism), M.Sc (Physiology) K.L University MBA, MCA, BBA Exams in December @Ameerpet. Ph : 9440027497, 9553194030. [H-193204]

WANTED
■ రామకృష్ణ గ్రూపు, VJA, HYD శ్రీమంతుల ఇళ్లలో వృద్ధుల సేవకు వంట/ఇంటిపని, బేబీకేర్ వర్కర్స్ కావలెను. జీ. 15 to 22 వేలు. ఏజెంట్లకు కమీషన్ 5 వేలు ✆ 8639756219, 8639756226 [B-1068118]
■ మీనాక్షి మోటార్స్ (బజాజ్ షోరూం) బోధన్‌లో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, వర్క్ షాప్ మేనేజర్, సర్వీస్ అడ్వైజర్, టెలికాలర్స్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్స్, మెకానిక్స్, వాషింగ్ బాయ్స్ కావలెను. ✆ 9440414119, 9182063229. [Z-1105723]
■ Wanted Teacher's to Teach Telugu, Maths, Physics and Biology from I - Std to X - Std & Pre - Primary. Contact on Cell: 8309582476. [Z-1105722]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/-రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలిం చిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.